
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.758 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 72.758 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2,050, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 1,200, దక్షిణ కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నెల్లూరు నగరంలో జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం సందర్భంగా సినీనటి పాయల్ రాజ్‌పుత్ శనివారం సందడి చేశారు. 8లో



గరిష్టం/కనిష్టం
30.6 /23.3

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల తగ్గుముఖం పట్టాయి. శనివారం గాలిలో తేమ 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌లో 28,166 కేసుల పరిష్కారం



న్యాయసేవాసదన్ భవన్ వద్ద జరిగిన లాక్‌అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు

నెల్లూరు (లీగల్): ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 28,166 కేసులు పరిష్కరించి రూ.1,84,23,894 పరిహారంగా అందజేశారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. యామిని ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కోర్టుకు సంబంధించి 7 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ అధికారులుగా న్యాయమూర్తులు వెంకట నాగపవన్, కరుణకుమార్, భరద్వాజ, భాస్కర్‌రావు, దేవిక, లావణ్య, సుయోధన్ వ్యవహరించి 13,235 కేసులను పరిష్కరించారు. గూడూరులో 54, కోవూరు 3,602, కావలి 2,734, వెంకటగిరి 1,549, కోట 3,534, నాయుడుపేట 1,631, సూళ్లూరుపేట 686, ఆత్మకూరు 1,126, ఉదయగిరి 15 కేసుల వంతు పరిష్కరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంక్, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి జూడో క్రీడాకారుల ఎంపికలు

కావలి: జిల్లా స్థాయి జూడో పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపికలు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు కావలిలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతాయని జిల్లా జూడో అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు మురళి ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లు పైబడిన వారు మాత్రమే అర్హులని, సెలెక్ట్ అయిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకుని రావాలి. వివరాలకు టి. సురేష్‌ను 8919036160లో సంప్రదించాలని కోరారు.

కర్షకుడి కంట కన్నీళ్లు

కూటమి ప్రభుత్వం కర్షకుల పాలిట శాపంగా దాపురించింది. ఎరువుల కొరత లేదు.. సబ్సిడీల తగ్గింపు లేదు. కానీ ఈ రబీ సీజన్‌లో వ్యాపారులు ఎరువుల ధరలను పెంచి రైతుల వెన్ను విరుస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు సమృద్ధిగా ఎరువులను అందించేందుకు ముందస్తు ప్రణాళికతోనే సిద్ధం చేస్తూ వచ్చింది. రైతులకు రవాణా భారం కూడా లేకుండా నేరుగా గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా సరఫరా చేసింది. మరో వైపు డీసీఎంఎస్ ద్వారా విక్రయాలు చేసింది. ఫలితంగా ఎక్కడా ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలు, సొసైటీల ద్వారా ఎరువుల సరఫరాను నిలిపివేసింది. దీంతో వ్యాపారులు కొరత సృష్టించి ధరలు పెంచి దోచుకుంటున్నారు.

- రైతులపై ఎరువుల ధరాభారం రూ.5 కోట్ల పైమాటే
- రబీ సీజన్‌లో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్
- బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకు పెంపు
- అదేం లేదంటూ వ్యవసాయశాఖ బుకాయింపు
- వ్యాపారుల కొమ్ముకాస్తున్న వ్యవసాయశాఖ
- అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ దాడుల్లో బట్టబయలు
- పలువురిపై 6ఏ కేసుల నమోదు

పెరిగిన ఎరువుల ధరలు (బస్తాల్లో)

ఎరువులు	పాతధర (రూ)	కొత్త ధర (రూ)
28.28.0	1,680	1,800
14.35.14	1,680	1,800
20.20.0.13	1,100	1,300
10.26.26	1,370	1,470
16.20.0.13	1,100	1,250
24.24.0.08	1,700	1,800
డీఏపీ	1,350	1,450



ఎరువు	అవసరం (మె.టి.)
యూరియా	83,370.52
డీఏపీ	18,129.09
కాంప్లెక్స్ ఎరువులు	57,409.08
పొటాష్	5,323.45
ఎస్ఎస్‌పీ	10,559.68



సాగులో ఉన్న వరి పైరు

ఉదయగిరి: ఆరుగాలం కష్టపడి పంట పండించే కర్షకుడు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రబీ సీజన్‌లో వరి సాగు జరుగుతోంది. అధిక వర్షాలతో ఈ ఏడాది రబీ సీజన్‌లో నాట్లు ఆలస్యమయ్యాయి. ఇప్పటికీ దాదాపు 50- 60 శాతం కూడా నాట్లు పూర్తి కాలేదు. సాగు ప్రారంభంలోనే వ్యాపారులు ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి.. ధరలు పెంచి దోచుకుంటున్నారు. సాగు చేసే విస్తీర్ణానికి సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నా.. రైతుల అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో కొందరు వ్యాపారులు అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాల విషయం బయటపడడంతో వారిపై కేసులు కూడా నమోదు చేయడం చూస్తే.. వ్యవసాయశాఖాధికారులు ఎక్కడా ధరలు పెరగలేదు.. పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఉత్తుత్తి ప్రకటనలు చేస్తూ వ్యాపారుల కొమ్ము కాస్తున్నారని స్పష్టమవుతోంది.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా నిలిచారు. సీజన్‌కు ముందు సాగుకు విస్తీర్ణానికి సరిపడా ఎరువులను సిద్ధం చేస్తూ వచ్చారు. ఆర్బీకేలు, సొసైటీల ద్వారా నాణ్యమైన ఎరువులను ఎమ్మార్పీ ధరలకే సరఫరా చేశారు. ఎప్పుడు ఎరువుల కొరత తలెత్తలేదు. మార్కెట్లో ఎరువుల వ్యాపారులపై నిఘా పెట్టి నకిలీ ఎరువులు అమ్మకుండా ధరలు పెంచకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. గత ఐదేళ్లు ఎప్పుడూ ఎరువుల బ్లాక్ మార్కెట్లో రైతులు కొనే పరిస్థితి రాలేదు.

రబీలో రూ.5 కోట్ల భారం

జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు రైతులు సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి, మినుము, శనగ, మిరప తదితర పంటలు సాగు జరుగుతోంది. రబీ సీజన్‌లో వివిధ రకాల 1,74,831.8 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ అధికారుల అంచనా. అయితే ప్రస్తుతానికి 52,804 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో ఉంది. అయితే ధరలు పెరగడానికి కారణం తాము కాదని, ప్రభుత్వమే పెంచిందని వ్యాపారులు చెబుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెంచగా, డీలర్లు వ్యాపారులు రూ.50 వరకు పెంచి దోచుకుంటున్నారు. ప్రధానంగా డిమాండ్ ఉన్న యూరియా, 20.20.0.13, 28.28.0, 14.35.14 ఎరువులపై అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో పాటు వివిధ కంపెనీల పురుగు మందులు కూడా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఈ లెక్కన జిల్లా రైతుల నెత్తిన ఈ రబీ సీజన్‌లోనే సుమారు రూ.5 కోట్లకు పైగా భారం పడుతోంది.

కూటమి ప్రభుత్వం కూతలే..



కాంప్లెక్స్ ఎరువులు

తాము అధికారంలోకి వస్తే రైతులకు అవి చేస్తాం.. ఇవి చేస్తామంటూ ఎన్నెన్నో హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే అన్నదాతలను నిలువునా దగాకు గురి చేస్తున్నారు. ఇప్పటికే రైతు భరోసా పథకాన్ని పెంచి ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకపోగా, ప్రభుత్వమే చెల్లించాల్సిన బీమాను రైతులే కట్టుకోవాలంటూ తప్పుకుంది. మరో వైపు ఆర్బీకేలు, సొసైటీల్లో ఎరువుల విక్రయాలను నిలిపివేసింది. ఇదే అదనుగా వ్యాపారులు మార్కెట్లో ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క ఎరువుల బస్తాపై రకాన్ని బట్టి రూ.100 నుంచి రూ.150 వరకు ధరలు పెంచి దోచుకుంటున్నారు. చేవ చచ్చిన వ్యవసాయశాఖాధికారులు, అసమర్థ పాలకులు చేష్టలుడిగి చూస్తున్నారు.

ఎరువుల భారం మోయలేము



నేను 5 ఎకరాల్లో పసుపు, వరి సాగు చేశాను. ఎరువుల కోసం దుకాణాలకు వెళితే గతేడాదికి ఇప్పటికీ రూ.150 వరకు అధికంగా ధరలు పెరిగాయి. ధరలు పెరిగినట్లుగా పంట ఉత్పత్తుల ధరలు పెరగడం లేదు. వచ్చే సీజన్‌లో పంటలు వేయాలంటే ఆలోచించాల్సి పరిస్థితి నెలకొంది. పంటలు సాగు చేయాలంటే భయమేస్తోంది.

– సిద్దు రామిరెడ్డి, రైతు, కొత్తపాళెం, ఉదయగిరి

ఎరువుల ధరలు తగ్గించాలి



ప్రభుత్వం పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించి రైతులపై భారం తొలగించాలి. ఎన్నికల ముందు రైతులను ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు ధరలు పెంచడం న్యాయంగా లేదు. రైతులు పంట వేయడం మానేస్తే ఆహార సంక్షోభం వస్తుంది. పెంచిన ధరలు తగ్గించి, రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధర పెంచాలి.

– కాకు వెంకటయ్య, జిల్లా రైతు సంఘం నేత

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లాలో వ్యాపారులు, డీలర్లు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మా సిబ్బంది నిరంతర నిఘాలో ఉన్నారు. ఎక్కడైనా ఆ పరిస్థితి ఉంటే నా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఈ సీజన్‌లో ఎరువుల కొరత లేదు. అవసరమైన మేరకు స్టాక్ రైతులకు అందుబాటులో ఉంచాం.

– సత్యవాణి, జేడీ, వ్యవసాయశాఖ

ఖాకీల సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

నిర్బంధాలు.. ఏకపక్షంగా ఏకగ్రీవాలు

- టీడీపీ కార్యవర్గ ఎన్నికల్లా.. సాగునీటి సంఘం ఎన్నికలు
- ఏకపక్ష ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ
- అర్ధరాత్రి నుంచి నేతల నిర్బంధం
- నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వని వైనం
- ఏకగ్రీవం కాదనుకున్న చోట్ల సర్టిఫికెట్లు చెల్లవంటూ అడ్డగింత
- 486 సంఘాల్లో వర్గాల కుమ్ములాటలు, 9 సంఘాల ఎన్నికలు వాయిదా

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఖాకీల సాక్షిగా అప్రజాస్వామికంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీని అడ్డుకునేందుకు అధికార టీడీపీ నాయకులు అడ్డంగా బరితెగిస్తే.. ఖాకీలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార పార్టీకి ఊడిగం చేశారు. ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకున్నా ఫలితం దక్కే పరిస్థితి కనిపించకపోవడంతో పోలీసులను అడ్డం పెట్టుకుని అరాచకానికి పాల్పడ్డారు. ఏక పక్ష ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించినప్పటికీ జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి వేళ ఆ పార్టీ నేతలను అక్రమంగా స్టేషన్లలో నిర్బంధించి వేధించారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు అధికార పార్టీ దాష్టీకానికి పరాకాష్టగా నిలిచాయి. పోలీసులను, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అడుగడుగున కూటమి నేతల దౌర్జన్యాలు.. కుట్రలు.. బెదిరింపులతో అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలకు పాల్పడ్డారు. ఆది నుంచి ఈ ఎన్నికల ప్రక్రియను అడ్డదారిలో నిర్వహించేందుకు అధికార పార్టీ కుట్రలు చేయడంతో ఎన్నికలు సక్రమంగా జరగవని భావించి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ఎన్నికలను బహిష్కరించింది. అయినా గెలుపు ధీమా లేక.. వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులతో అక్రమంగా నిర్బంధించారు. పోటీకి సిద్ధపడిన రైతులను నో డ్యూస్ సర్టిఫికెట్ల పేరుతో ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారు. అయితే పలుచోట్ల కూటమి నేతలే వర్గాలుగా విడిపోయి పోటీ పడ్డారు. కొన్ని చోట్ల ఘర్షణకు దిగారు. అధికార పార్టీ నాయకులే అధికారుల అవతారమెత్తి ఏకగ్రీవంగా కాకుండా ఏక పక్షంగా తమ వారు ఎన్నికైనట్లు ప్రకటించుకున్నారు. జిల్లాలో శనివారం 486 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అధికార పార్టీలోని వర్గపోరు కారణంగా 9 సంఘాలకు ఎన్నికలను వాయిదా వేశారు. మిగతా 477 సంఘాల ఎన్నికల ప్రక్రియను మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సార్లు ఎన్నికలను వాయిదా వేసింది. ప్రాజెక్ట్ కమిటీలను మినహాయించి 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 486 వాటర్ యూజర్ అసోసియేషన్లకు, ప్రాదేశిక నియోజకవర్గాలకు (సంఘాలకు) ఎన్నికలు జరిగాయి. 3,698 టీసీలకు ఎన్నికలు జరగ్గా అందులో 59 వాయిదా పడ్డాయి.

ఎన్నికల అధికారుల దాష్టీకాలు

ఏఎస్‌పేట మండలంలోని అబ్బీపురం, జమ్మవరం గ్రామాల్లో వివాదాస్పద పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఓ వర్గానికి మద్దతిస్తూ మంత్రి ఆనం ఇచ్చిన జాబితాలోని వ్యక్తులకు భూమి శిస్తు, నీటి తీరువా కట్టించుకొని రసీదులు అధికారులు అందజేశారు. అదే క్రమంలో మరో వర్గం వారికి నీటి తీరువా కట్టించుకోకుండానే అధికారులు వెళ్లిపోవడంతో ఆ వర్గం హైస్కూల్ గేట్లు బంద్ చేసి బైఠాయించి అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేశారు.

- ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెం టీసీకి మెట్టా శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ ఆమారి సుధాకర్ భార్య అమారి పాపమ్మ పోటీ పడ్డారు. శ్రీనివాసులురెడ్డికి 36 ఓట్లు రాగా పామ్మకు 39 ఓట్లు లభించాయి. దీంతో దళిత మహిళ పాపమ్మ మూడు ఓట్లతో గెలుపొందినట్లు అధికారులు విజేతగా ప్రకటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి అధికారులను, పాపమ్మను బెదిరించి శ్రీనివాసులురెడ్డి విజయం సాధించినట్లు ప్రకటించేలా చేశారు.
- వింజమూరు మండలం ఏ.కీర్తిపురంలో టీసీలకు నామినేషన్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన రైతులను పోలీసులే అడ్డుకున్నారు. నోడ్యూస్ ధ్రువపత్రాలు వీఆర్వోలు ఇచ్చినా, అవి చెల్లవు తహసీల్దార్ కౌంటర్ సంతకం ఉండాలంటూ అధికారులు తిరస్కరించారు. వింజమూరు మండలం బుక్కపురంలో కూడా నోడ్యూస్ సర్టిఫికెట్లు అడ్డం పెట్టి పోటీకి సిద్ధపడిన రైతులను పోటీలో లేకుండా చేసి ఎన్నికను ఏకపక్షంగా జరిపించారు.
- కొండాపురం మండలం గానుగపెంటలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గీయుల మధ్య పోటీ ఉద్రిక్తత పరిస్థితికి దారి తీసింది. స్వల్ప ఓట్లు బలం ఉన్న కాకర్ల వర్గీయులకు అధికారులు, పోలీసులు మద్దతుగా నిలిచారు. దీంతో బొల్లినేని వర్గం తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో పోలింగ్ బూత్ ముందు బైఠాయించి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామంలో 160 ఓట్లు ఉంటే మాకు 150 బలం ఉన్నా,నామినేషన్లు వేసేందుకు నోడ్యూస్ సర్టిఫికెట్లల్లో తహసీల్దార్ సంతకం సాకుగా చూపారని వాపోయారు.
- చేజర్ల మండలం నాగులవెల్లటూరులో రెండు వర్గాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది.
- వెంకటాచలం మండలం కసుమూరు, కందలపాడులో రైతులు పార్టీలకతీతంగా నామినేషన్లు వేసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు.
- మనుబోలు మండలంలోని జట్లకొండూరులో పార్టీలకు అతీతంగా పోటీ చేసేందుకు సిద్ధపడిన రైతులను సమయం మించిపోయిందంటూ నామినేషన్లు స్వీకరించకుండా అధికారులు అడ్డుకున్నారు.



కుడితిపాళెం 12వ టీసీలో పాపమ్మ గెలిచినట్లు బోర్డులో ప్రకటన

అధికార పార్టీలో కుమ్ములాటలు

వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు దూరంగా ఉండడంతో ఏకగ్రీవంగా ఎనికలు జరగాల్సి ఉన్నప్పటికీ పలు చోట్ల అధికార పార్టీలో కుమ్ములాటలు బయట పడ్డాయి. ఏఎస్‌పేట మండలం జమ్మవరం, పెద్ద అబ్బీపురం గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వాదోపవాదాలతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆత్మకూరు నియోజకవర్గంలోని బట్టేపాడు, చిన్నమాచనూరు, నాగినేనిగుంట సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి.

అరాచక పాలనకు నిదర్శనం



సాగునీటి సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. బోగోలులో పార్టీకి అతీతంగా ఓ రైతు పోటీకి సిద్ధపడ్డారు. ఈ ఒక్క స్థానంలో కూడా పోటీని ఎదుర్కోలేక టీడీపీ అరాచకానికి తెరతీసింది. పోలీసులను అడ్డు పెట్టుకుని ఎన్నికలకు కొద్ది గంటల ముందు, అర్ధరాత్రి వేళ ఇంట్లో నిద్రిస్తున్న నాయకులను స్టేషన్‌కు తరలించడం దుర్మార్గం. ఒక్క సీటు కూడా గెలుచుకోలేక ఇంతకు దిగజారడం, పోలీసులను అడ్డు పెట్టుకోవడం సిగ్గు చేటు.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే

అర్ధరాత్రి అరాచకం

- ఇంట్లో నిద్రిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, అభ్యర్థిని స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- డబ్బులు పంచుతున్నారంటూ తప్పుడు కేసు పెట్టేందుకు విఫలయత్నం
- పోలీసుల వైఖరిపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి



ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

బిట్రగుంట: బోగోలు చెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న అధికార టీడీపీ నేతలు బరితెగించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమంగా నిర్బంధించి తప్పుడు కేసులు బనాయించేందుకు సిద్ధపడ్డారు. రైతులను భయాందోళనలకు గురి చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి వేళ పోలీసులు హద్దుమీరి ప్రవర్తించారు. ఇంట్లో నిద్రిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘుతోపాటు ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడిన రైతు దగుమాటి కొండయ్యను కారణాలు చెప్పకుండా అర్ధరాత్రి సమయంలో బలవంతంగా స్టేషన్‌కు తరలించి సెల్‌ఫోన్లు లాక్కొన్నారు. ఎస్పై వచ్చే వరకు స్టేషన్‌లోనే ఉండాలంటూ హుకుం జారీ చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రాత్రి 11.30 గంటల సమయంలో పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కూడా హుటాహుటిన స్టేషన్‌కు చేరుకుని పోలీసులను నిలదీశారు. ఓటర్లకు డబ్బులు పంచుతుంటే పట్టుకున్నామంటూ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి ఒంటి గంట సమయంలో వారిని విడిచిపెట్టారు.

హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో..

బోగోలు చెరువు సాగునీటి సంఘం ఓటర్ల జాబితాను అధికార పక్షం ఏకపక్షంగా సిద్ధం చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు సైతం ఆధారాలతో సహా వినతిపత్రాలు ఇచ్చినా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో రఘు రిట్ పిటిషన్ ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం సాయంత్రం హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన కొద్ది గంటల్లోనే పోలీసులు రఘును, కొండయ్యను అర్ధరాత్రి స్టేషన్‌కు తరలించి, డబ్బులు పంచుతున్నారంటూ పోలీసులు చేసిన ఆరోపణ కూడా తీవ్ర వివాదానికి దారి తీసింది.

నియంతల్లా వ్యవహరిస్తున్నారు

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన నడుస్తుందో లేక నియంత పాలన నడుస్తుందో అర్థం కావడం లేదు. ఇంట్లో నిద్రపోతున్న మమ్మల్ని లేవగొట్టి స్టేషన్‌కు తీసుకురావడం, డబ్బులు పంచుతున్నారని చెప్పడం అధికార పార్టీ దుర్మార్గానికి నిదర్శనం. సాగునీటి సంఘం ఎన్నికల్లో అసలు ఎవరైనా డబ్బులు పంచుతారా? న్యాయంగా గెలవలేక కుట్రలు, కుతంత్రాలతో గెలవాలనుకోవడం దుర్మార్గం.

– మద్దిబోయిన వీరరఘు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

బాల్యంలోనే బందీలుగా..

- గ్రామాల్లో ఆగని బాల్య వివాహాలు
- ఆర్థిక ఇబ్బందులతో పాటు ప్రేమ పెళ్లిళ్ల భయం
- అధికారుల హెచ్చరికలు పెడచెవిన

పుస్తకాలు పట్టాల్సిన చిట్టి తల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని ఆ పుత్తడి బొమ్మల మెడలో పుస్తెలతాడు ఉరితాడులా మారుతోంది. తెలిసీ తెలియని వయస్సులో పట్టుమని 15 ఏళ్లు కూడా నిండని వారిపై సంసార బాధ్యతలు గుదిబండలా మారుతున్నాయి. పేదరికం ఓ వైపు.. ఆడపిల్ల భారం తీరుతుందనే ఉద్దేశంతో సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. చిరుప్రాయంలోనే గర్భం దాల్చి అనారోగ్యం బారిన పడి జీవితాలు కోల్పోతున్నారు.

కోవూరు: బాల్య వివాహాలు చిన్నారులను చీకట్లోకి నెట్టేస్తున్నాయి. బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలనే వీరి ఆశయాలను కొందరు తల్లిదండ్రులు చిదిమేస్తున్నారు. చిరు ప్రాయంలోనే పెళ్లి చేయడంతో అనారోగ్యానికి గురవుతూ మగ్గిపోతున్నారు.

నిబంధనలు బేఖాతర్

వాస్తవానికి అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండితేనే వివాహం చేయాలనేది నిబంధన. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు చిన్న వయస్సులోనే వివాహం చేసి బరువు దించేసుకోవాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ కారణంగానే బాల్య వివాహాలపై మొగ్గుచూపుతున్నారు. ఇలా వ్యవహరించడం తగదని అధికారులు అవగాహన కల్పిస్తున్నా, ప్రయోజనం ఉండటంలేదు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు.. ప్రేమ పెళ్లిళ్లనే భయంతో మరికొందరు ఈ రకంగా వ్యవహరిస్తున్నారు.

సమాచారమూ కరువే..

బాల్య వివాహాన్ని ఇటీవల అధికారులు అడ్డుకున్నారు. దీంతో యుక్త వయస్సు వచ్చేంత వరకు బాలికను ప్రభుత్వ వసతి గృహంలో ఉండేలా తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక హామీ పొందారు. అయితే కొన్ని సందర్భాల్లో బాల్య వివాహాలపై అధికారులకు ఎలాంటి సమాచారం అందడంలేదు.



అధికారులు అడ్డుకున్నవి
2019 – 65
2020 – 18
2021 – 30
2022 – 15
2023 – 45
2024 – 31
మొత్తం – 204



పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులు - 8

గ్రామ పోలీసులు చురుగ్గా ఉండాలి



గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై ఉన్నతాధికారులకు సకాలంలో సమాచారం అందించాల్సిన బాధ్యత గ్రామ పోలీసులపై ఉంది. ఈ విషయంలో ఎవరో ఏదో అంటారని భయపడాల్సిన అవసరం లేదు. వీరి బాధ్యతలకు అండగా ఉంటాం. బాల్య వివాహాలను నిరోధించడమే అందరి లక్ష్యం.

– సుధాకర్‌రెడ్డి, సీఐ, కోవూరు

బంగారు భవిష్యత్తును కోల్పోతారు



బాల్య వివాహాలతో బాలికలు తమ బంగారు భవిష్యత్తును కోల్పోతారు. చిన్న వయస్సులోనే కుటుంబ భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రతి ఒక్కర్నీ బాగా చదివించి వారు అనుకున్న లక్ష్యాల దిశగా ప్రోత్సహించాలి. అప్పటి వరకు వీరిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

– శింగంపల్లి నరసింహమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

నియంత్రణ చాలా ముఖ్యం



బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ కట్టడి చేయాలి. వీటితో బంగారు భవిష్యత్తు నాశనమవుతుంది. చదువుకోవాల్సిన వయస్సులో బాలికలకు పెళ్లి చేయడం తగదు. ఇలా చేయడం ద్వారా భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి.

– అహ్మద్, ఉప సర్పంచ్, పడుగుపాడు

ప్రమాదంలో పడతారు



బాల్య వివాహాలు చేయడంతో గర్భం దాల్చిన బాలికలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. బిడ్డను మోసే సామర్థ్యం వారికి తక్కువగా ఉంటుంది. చిన్న వయస్సులో గర్భం దాలిస్తే బిడ్డతో పాటు తల్లి ప్రాణానికీ ప్రమాదమే. వీటికి దూరంగా ఉండాలి.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

చురుకైన పాత్ర

బాల్య వివాహాలు చేయడం తప్పంటూ ఐసీడీఎస్ అధికారులు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గ్రామ పోలీసులు వీటిని నిరోధించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సంగం మండలం కొలగట్ల, దువ్వూరులో ఇటీవల జరుగుతున్న బాల్య వివాహాన్ని శిశు సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు.



బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై సంగం మండలంలో అవగాహన (ఫైల్)

స్త్రీ నిధి రుణాలతో ఆర్థిక ప్రగతి

నెల్లూరు (పొగతోట): బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తున్న స్త్రీ నిధి రుణాలను స్వయం సహాయక గ్రూపు మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. విజయవాడ నుంచి సెర్ప్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించారు. అనంతరం జిల్లా సమాఖ్య సభ్యులతో సమావేశమైన పీడీ మాట్లాడారు. రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు. వీరి ర్యాంకుల ఆధారంగా స్వయం సహాయక గ్రూపు మహిళలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాలను మంజూరు చేయనున్నారని వివరించారు. స్త్రీ నిధి ఏజీఎం కామాక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన క్రాంతికుమార్, హారిక దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఈ క్రమంలో ఇంటి నుంచి శుక్రవారం ఆమె అదృశమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు .

నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ.20
సన్నవి: రూ.15
పండ్లు: రూ.8



హెల్త్ అసిస్టెంట్లను వీధిన పడేశారు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో హెల్త్ అసిస్టెంట్లుగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తెలంగాణ కోర్టు తీర్పు పేరుతో తొలగించి వీధినపడేయడం దారుణమని ఏపీ హంస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ పేర్కొన్నారు. సంతపేటలోని హంస జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. గుంటూరులోని మలేరియా విభాగంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొల్లి లక్ష్మణరావు ఉద్యోగాన్ని పోగొట్టుకొని ఆందోళనతో గుండెపోటుకు గురై మృతి చెందడం బాధాకరమని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 54 మందిని విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. తమను ఏ క్షణంలో తీసేస్తారోననే భయంతో 110 మంది ఉన్నారని చెప్పారు. ఇక్కడి వైద్యశాఖ అధికారులు అత్యుత్సాహంతో పనిచేస్తూ కోర్టు నిబంధనలను పాటించలేదని విమర్శించారు. కోర్టు తీర్పు మేరకు మూడు నెలల ముందుగా నోటీసులిచ్చి, మూడు నెలలు జీతాలిచ్చి తీసేయాల్సి ఉన్నా, ఇలా వ్యవహరించకపోవడంలో గల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి ఉద్యోగాల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కోశాధికారి మజరుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని పెయింటర్ మృతి



నెల్లూరు(క్రైమ్): బైక్‌లు ఢీకొనడంతో పెయింటర్ మృతి చెందిన ఘటన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. వెంగళరావ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఇమ్మానుయెల్ (67), జీవ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెయింటింగ్ పనులు చేసుకొని కుటుంబాన్ని ఆయన పోషిస్తున్నారు. క్రిస్మస్ నేపథ్యంలో కొండాయపాళెం గేట్ సమీపంలోని ఓ చర్చికి పెయింట్లు వేసేందుకు వెళ్లారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలో టీ తాగి స్కూటీపై రోడ్డు దాటుతుండగా, కొండాయపాళెం గేట్ వైపు నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న పల్సర్ బైక్ ఢీకొంది. దీంతో ఇమ్మానుయెల్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యారు. క్షతగాత్రుడ్ని జీజీహెచ్‌కు స్థానికులు తరలించగా, కొద్దిసేపటికే మృతి చెందారు. ఈ మేరకు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలం, ఆస్పత్రిలో మృతదేహాన్ని ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన ఘటన పట్టణంలోని వీఎంపల్లి వద్ద శనివారం చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన ప్రేమికులు వినయ్, హేమలత (23) ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుంటారు. తిరుమల దర్శనార్థం శుక్రవారం వెళ్లి, అనంతరం నెల్లూరు బయల్దేరారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తిలోని వీఎంపల్లి వద్ద రైలు చక్రాల లారీకి హేమలత బ్యాగ్ చిక్కుకోవడంతో కింద పడ్డారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వినయ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 103
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 178



చార్జీలతో బాదుతున్న ప్రభుత్వం

- విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దానికి విరుద్ధంగా ఆర్నెల్లోపే రూ.18 వేల కోట్ల భారాన్ని మోపి ప్రజలను మోసం చేసిందని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. నగరంలోని రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ వద్ద నిరసనను శనివారం చేపట్టారు. తొలుత కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. పెంచిన విద్యుత్‌చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కరెంట్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు మస్తాన్‌బీ, నగర కమిటీ సభ్యులు చిరంజీవి, నరసింహ, ఏమేలు, చెంగయ్య, వేణు, రవూఫ్, అంకయ్య, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

జిల్లా అభివృద్ధికి ప్రణాళిక

నెల్లూరు(అర్బన్): జిల్లాలో 2029 నాటికి 15 శాతం వృద్ధి రేటే లక్ష్యంగా ప్రస్తుత జీడీపీ రూ.61,664 కోట్ల నుంచి రూ.1,31,180 కోట్లకు చేరుకునేందుకు అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్ – 2047లో జిల్లాకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను విడుదల చేశామని చెప్పారు.

- రూ.3,700 కోట్ల అంచనాలతో నాలుగు బెర్తుల డీప్ – సీ పోర్టుగా రామాయపట్నం పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు.
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25 వేల మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు.
- వ్యవసాయంలో 73,116 హెక్టార్ల సాగు చేయదగిన భూమిని ఐదేళ్లలో సాగులోకి తేవడం, పప్పు ధాన్యాల విస్తీర్ణాన్ని 12,740 హెక్టార్ల నుంచి 22,499 హెక్టార్లకు పెంచడమే లక్ష్యమన్నారు.
- మైక్రో ఇరిగేషన్ ద్వారా 10,395 హెక్టార్ల నుంచి 18,178 హెక్టార్లకు విస్తరించడం, ప్రతి పంటలో వార్షికంగా 15 శాతం వృద్ధి సాధించడం, ఈ
- మార్కెట్లను అభివృద్ధి చేసి రిటైల్ షాపులు, గోదాములు, వెజిటబుల్ మార్కెట్లు నెలకొల్పడమే లక్ష్యమని చెప్పారు.
- పరిశ్రమలకు సంబంధించిన మెగా, మైక్రో, చిన్న సంస్థల సంఖ్యను 11,992 నుంచి 24,004కు పెంచడం.. పోర్టు ఆధారిత పరిశ్రమల కోసం భూ బ్యాంకులను అభివృద్ధి చేయడం.. గార్మెంట్, చెక్క పరికరాలు వంటి క్లస్టర్లను ప్రోత్సహించనున్నామని పేర్కొన్నారు.
- అన్ని పర్యాటక ప్రాంతాలను డిజిటల్ రిపాజిటరీలుగా అభివృద్ధి చేయడం.. సర్వేపల్లి చెరువు, మైపాడు బీచ్‌లలో వాటర్ స్పోర్ట్స్‌ను ప్రారంభించనున్నామని తెలిపారు.

జోస్ ఆలుక్కాస్ షోరూమ్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని మాగుంట లేఅవుట్లో జోస్ ఆలుక్కాస్ 60వ ఆభరణాల షోరూమ్‌ను ప్రముఖ నటి పాయల్ రాజ్‌పుత్ శనివారం ప్రారంభించారు. నెల్లూరు రూరల్, కోవూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కాస్, పాల్ ఆలుక్కాస్, జాన్ ఆలుక్కాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మాట్లాడారు. షోరూమ్ ప్రారంభ సందర్భంగా రూ.60 వేల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల కొనుగోలుపై బంగారు నాణేన్ని అందిస్తున్నామని, ఈ ఆఫర్ ఈ నెల 18 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. వజ్రాభరణాల కొనుగోలుపై 20 శాతం, ప్లాటినమ్ ఆభరణాలపై ఏడు శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. వెండి నగలపై తరుగు చార్జీలుండవని, ప్రతి కొనుగోలుతో ఒక ప్రత్యేక బహుమతిని అందిస్తున్నామని వివరించారు.